


జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 25-12-2024 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 202 పేజీలు: 4 వెల : రూ.7

# హ్యాపీ క్రిస్మస్

శ్రీకాకుళం, డిసెంబర్ 24 (వార్త): జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు, విద్యుద్దీపాల వెలుగులో ధగధగ మెరిసిపోతున్నాయి. క్రీస్తు సందేశాలు, ప్రార్ధనలు, భక్తి గీతాలు, నృత్యాలతో కళకళలాడుతున్నాయి. వాడవాడలా సెమీక్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. చర్చిల్లో శాంతాక్లాజ్ బొమ్మలు, ట్రీలు ఆకట్టుకుంటున్నాయి. క్రైస్తవుల ఇళ్లలోనూ కాంతులు విరజిమ్ముతున్నాయి. నగరంలోని ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న చర్చిలో, డగ్లస్ స్కూల్ ఆవరణలో ఉన్న చర్చి, మహిళా కళాశాల ఎదురుగా ఉన్న చర్చి, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్ధనలు ప్రారంభమయ్యాయి. పలువురు తమ తమ ఇళ్లల్లోనూ ప్రార్ధనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుకను తెలియపరిచే రీతిలో పశువుల పాకలు, వివిధ ఘట్టాలను అనేక చర్చిల్లో ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి క్రైస్తవులు ఒకరికొకరు హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్ అని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నగరంలో పెద్ద ఎత్తున ప్రార్ధనలు చేస్తూ ర్యాలీ చేశారు. చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి.








జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా తిరుమల



**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా శ్రీకాకుళంలోని హరిజన వీధికి చెందిన దాసరి తిరుమలరావు మాదిగ ను ఎంపిక చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాదిగ మాట్లాడుతూ దళిత సామాజికవర్గానికి తాను చేసిన సేవలను గుర్తిస్తూ, తనను ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలి పారు. దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి మరింత కృషి చేస్తానన్నారు. తిరుమలరావు ఎంపికపై మాదిగ సామాజిక పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

# వినియోగదారులకు సత్వర న్యాయమే లక్ష్యం

**-జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**



**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** వినియోగదారులు తమ హక్కులు తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన బాపూజీ కళామందిర్‌లో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు నష్టం జరిగితే సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినియోగదారుల చట్టం అందరికీ అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతులను జేసీ అందజేశారు. డ్రగ్స్ అండ్ కంట్రోల్, తూనికలు-కొలతలు, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్, ఉద్యాన తదితర శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను అతిథులు పరిశీలించారు.

కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా.బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డా.కళ్యాణ్‌బాబు, జీఎస్టీ సహాయ కమి షనర్ రాణిమోహన్, గంజి ఆర్ ఎజ్రా, జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ బాగాది రామ్మోహన్‌రావు, ఎండీయూ ఆపరేటర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, బుడుమూరు శ్రీరామమూర్తి, దేవీశ్రీ ఎంటర్‌ప్రైజెస్ గ్యాస్, ఇతర శాఖల అధికారులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను దగా చేస్తున్న కూటమి

**-27న టెక్కలి లో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన**

**-వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్**



**టెక్కలి, డిసెంబర్24(వార్త):** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న టెక్కలి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన టెక్కలి వైసీపీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్ల అదనపు భారాన్ని వినియోగదారులపై వేసి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పెంపును నిరసిస్తూ టెక్కలి విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం ఇస్తామన్నారు. టెక్కలి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి జడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి మండలాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంపశయ్యపై ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రి



**- సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి**

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 24(వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అంపశయ్యపై ఉందని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడారు. రోగులకు భోజనం అందివ్వడం లేదని, సరిపడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది లేరని, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే జనరేటర్ అందుబాటులో లేదని వాపోయారు. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయడం లేదని, ఆక్సిజన్ సిలిండర్లపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. డ్రైనేజీ లెవలింగ్ సమస్యతో ఆసుపత్రిలో మురుగు నీరు నిల్వతో దోమలు బెడద, దుర్వాసన ఏర్పడుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన డయాలసిస్ కేంద్రం పనులు ఇంచుమించు పూర్తి కావస్తున్నాయని, త్వరలో ప్రారంభించి రోగులకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రోగులకు ఇబ్బంది లేకుండా మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

# జిల్లా క్విజ్ పోటీల్లో హరిపురం విద్యార్థుల జయకేతనం

**మందస, డిసెంబర్ 24 (వార్త):** జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు, రైతులకు సన్మాన కార్యక్రమం శ్రీపవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్‌కుమార్, వాయులపల్లి మాధవరావు, రైతులు పల్లి చంద్రయ్య, అట్టాడు దుర్యోధన, గార రుద్రయ్య, సైన కామేశ్వరరావు, పోలాకి రాములు, పడ్డ మాధవరావు, పల్లి నాగభూషణంకు పలాస డీఎస్పీ అప్పారావు, ఏడీవో మధు కలిసి సన్మానించారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో 56 జట్లు పాల్గొన్నాయి. జడ్పీహెచ్ స్కూల్ హరిపురంనకు మొదటిస్థానం, శ్రీ సాయిశిరీష హైస్కూల్‌కు రెండో స్థానం, జడ్పీహెచ్ స్కూల్ లోహరిబందకు మూడో స్థానం దక్కాయి. విజేతలకు ఏటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పలాస ఎంపీడీవో కె.వసంతకుమార్, వజ్రపుకొత్తూరు ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.



కార్యక్రమంలో శ్రీపవనపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి భాస్కరరావు, అధ్యక్షుడు ఆశ న్న బాలరాజు, ప్రముఖ వైద్యుడు చిన్నంనాయుడు, హేమబాబు చౌదరి, ముంజేటి పాపారావు, ఐఎన్ రావు, కిశోర్, బంటుపల్లి భీమరాజు, నిమ్మన పాపారావు, సంస్థ సభ్యులు కొల్లి ఫల్గుణరావు, హనుమంతు జనార్దన్, రుంకు తారకేశ్వరరావు, అగురు అశోక్, పర్రి చిరంజీవి, దుగాన తిరుపతిరావు, పర్రి ఈశ్వరరావు, రాజమండ్రి అజయ్, వలంటీర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎన్ఈఆర్‌తో ఆర్జీయూకేటీ డైరెక్టర్, ఏవో భేటీ

**ఎచ్చెర్ల, డిసెంబర్ 24(వార్త):** ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును తన క్యాంపు కార్యాలయంలో ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచార్య బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాలలోని మౌలిక వసతులు, పారిశుధ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## లింగ వివక్షత సరికాదు




**మందస, డిసెంబర్ 24 (వార్త):** సమాజంలో లింగ వివక్ష సరికాదని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మంగళవారం ఆయన సువర్ణాపురం గ్రామ సంఘ మహిళలతో ర్యాలీ చేయించి అవగాహన కల్పించారు. మహిళలకు ప్రతిచోటా మంచి వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. మహిళలు సంఘాల ద్వారా పొందిన రుణాలతో ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి పథంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ ముఖలింగం, వీవోఏ అను, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## శ్రీరాజా విద్యాలయానికి పూర్వ విద్యార్థుల వితరణ

**మందస, డిసెంబర్ 24 (వార్త):** శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నతికి పూర్వ విద్యార్థులు వితరణ అందించారు. ఐకానిక్ భవనం మరమ్మతుల నిమిత్తం 2010 పదో తరగతి విద్యార్థులు సాయి, జగదీశ్, రాజీవ్, మణి, సుమన్, జీవన్, ఢిల్లీ, మధు, మనోజ్, సోమేశ్, బాల, యేసు, సంతోష్, మహేశ్, శ్యాం, మురళీ, తేజ రూ.21,010 అందజేశారు. వీరిని స్థానికులు అభినందించారు.

## మాజీ మంత్రి కార్యాలయంలో క్రిస్మస్ వేడుక

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 24(వార్త):** పలాసలోని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ స్టేట్ కోఆర్డినేటర్, వైసీపీ జిల్లా ఐటి సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు. ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రౌతు సూర్యనారాయణ సేవలకు గుర్తింపు



**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయమని జేసీ ఫర్మాన్‌ఖాన్ కొనియాడారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో జరిగిన వినియోగదారుల దినోత్సవంలో వారోత్సవాల్లో ఆయనకు డీఎస్‌వో సూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. ఇదే స్పూర్తితో మున్ముందు మరెన్నో సేవలందించాలని సూచించారు. సూర్య నారాయణను తోటి ఆపరేటర్లు పలువురు అభినందించారు. పలువురు ప్రముఖులు, అధికారులు కూడా ఆయన జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో చేస్తున్న సేవలను కొనియాడుతూ. అభినందనలు తెలిపారు.



## ధారణ, ధార, సృజనల సమ్మేళనమే గణిత అవధానం

**మందస, డిసెంబర్ 24 (వార్త):** దారణ,ధార, సృజనల సమ్మేళనమే గణిత అవధానం అని గణిత అవధాని మద్దు తిరుపతిరావు అన్నారు. జాతీయ గణిత వారోత్సవాల సందర్భంగా హరిపురంలోని విజేత స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ సార మాధవరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన గణిత దశావధానం అందర్నీ ఆకట్టుకుంది. ఘనమూలాలు, పంచమ మూలాలు, సమస్యా పూరణం, మనో సంకలనం, దత్తాంకం, దత్త భిన్నాంకం, వార గణన, వ్యస్తాంకం, గణిత చదరం, సరస ప్రసంగంపైన పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ సరైన విధానంలో బోధిస్తే అన్ని సబ్జెక్టుల కంటే చాలా సులభంగా గణితం అర్థమవుతుందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొరికాన నానాజీ, ప్రకాశ్‌రావు, రమేష్, దామోదర్, వికాస్, సరస్వతి, గీత, జీవిత తదితరులు పాల్గొన్నారు.

## 26న మందసలో మెగా రక్తదాన శిబిరం

**మందస, డిసెంబర్ 24 (వార్త):** మందసలో ఈనెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని శ్రీపవనపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి భాస్కర రావు తెలిపారు. శ్రీవినాయక సౌండింగ్, లైటింగ్ ఓనర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 9గంటల నుంచి శిబిరాన్ని మందసలోని అయ్యప్ప ఈవెంట్స్ ఎదురుగా నిర్వహిస్తున్నామన్నారు. యువతీ, యువకులు శిబిరంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు. వివరాలకు 8985801148కు ఫోన్ చేయాలని సూచించారు.

## ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలు




**పలాస, డిసెంబర్ 24(వార్త):** ఫ్లోరోసిస్ బాధితులకు రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో పునరావాస పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ లకినేని అరుణజ్యోతి, పీహెచ్‌ఎన్ సత్యవతి, హెచ్‌వీ ఈశ్వరమ్మ, మేరీబాయి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎమ్స్, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సంస్థల ప్రణాళిక విడుదల



**పలాస, డిసెంబర్ 24(వార్త):** శ్రీసత్యసాయి సేవాసంస్థల జిల్లాస్థాయి సమావేశం రామకృష్ణపురంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు ఈ ఏడాది చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల ప్రణాళిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన..పాఠశాల అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ బైరాగి, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, నాగేశ్వరరావు, వీవీవీఎస్ నారాయణమూర్తి, తాళాసు శ్రీను, మల్లా శరత్, సమితి, భజనమండలి కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వేసిన శాంతాక్లాజ్ వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



## ప్రభుత్వ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించండి

### -మాజీ మంత్రి సీదిరి




**పలాస, డిసెంబర్ 24(వార్త):** ప్రజల అభీష్టం మేరకు కార్గో ఎయిర్ పోర్టు నిర్మించాలని ప్రభుత్వానికి మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రగతి భవనంలో విలేఖరులతో మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కు అనువైన 1850 ఎకరాలు ప్రభుత్వ ఆధీ నంలో ఉందన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా పచ్చని ఉద్దానంలో నిర్మిస్తామని చెప్పడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని పరి గణనలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పలాస నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలపై వరుసగా జరుగుతున్న దాడులను ఖండించారు. పోలీసుల పక్షపాత వైఖరితోనే సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. పలాసలో ఐదుగురు టీడీపీ ముఠా సారథ్యంలోనే కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వెంకటాచలంకు రాష్ట్రస్థాయి అవార్డు ప్రదానం



**పలాస, డిసెంబర్ 24(వార్త):** వినియోగదారులకు సేవలందిస్తూ.. వారిని రెండు దశాబ్దాలుగా చైతన్యవంతులను చేస్తున్న వెంకటాచలంకు రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. మంగళవారం వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆయనకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్ అవార్డును అందించారు. వెంకటాచలం నందిగాం మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్‌గా, జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ ట్రైనీగా రెండేళ్లుగా ప్రజలను చైతన్యపరుస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయనకు అవార్డు రావడంపై జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బగాది రామ్మోహన్‌రావు, బమ్మిడి నరేంద్రకుమార్, పౌంసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, దువ్వాడ జనార్దన్ రావు, ఉప్పాడ రమేష్ అభినందనలు తెలిపారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### -వంగర మండల రీసర్వే డీటీ గంగాభవాని



**వంగర, డిసెంబర్ 24(వార్త):** రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు వంగర మండల రీసర్వే డీటీ రెడ్డి గంగాభవానీ, డీటీ హరిరామారావు తెలిపారు. మంగళవారం వారు కొప్పరవలసలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములకు సంబంధించిన ప్రతీ సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూవివాదాలు, చేర్పులు, మార్పులతో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాసు పుస్తకాలు, ఆన్‌లైన్, వెబ్‌ల్యాండ్, భూపంపిణీ తదితర సమస్యలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే గ్రామంలోనే వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కార్యక్రమంలో ఆర్‌ఐ రామారావు, వీఆర్‌వో, సచివాలయ సర్వేయరు, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రహదారి వేయరూ..!

### -టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీ వాసుల అభ్యర్థన

### -రోడ్డెక్కి నిరసన తెలిపిన మహిళలు

**టెక్కలి, డిసెంబర్ 24(వార్త):** టెక్కలిలిలోని ఎన్టీఆర్ కాలనీలో 2,3,4, 5,6 లైన్‌లోని వీధుల నుంచి పాత హైవేకు రోడ్డు సౌకర్యం లేక నివాసితులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే ఆ రహదారి గుంతల్లో నీరు నిల్వ ఉండి, బురదమయమై, కాలు పెట్టాలంటే వీలు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ..స్థానిక మహిళలు మంగళవారం రోడ్డుపైన నిరసన తెలిపారు. సీసీ రోడ్డు నిర్మించాలని నినాదాలు చేశారు. ఐదేళ్లుగా అప్పటి రాజకీయ నాయకులకు, అధికారులకు దఫ దఫాలుగా అర్జీలను సమర్పించినప్పటికీ ఇంతవరకు మోక్షం కలగలేదని వాపోయారు. చాలాసార్లు అధికారులు కొలతలు తీసుకోవడమే తప్ప రోడ్డు వేయలేదన్నారు. మంత్రి అచ్చన్నాయుడు స్పందించి సీసీ రోడ్డును మంజూరు చేయాలని వారు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# దీక్షలోనే దుర్గా గురుస్వామి కన్నుమూత



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 24(వార్త):** స్వేచ్ఛావతి అయ్యప్ప ఆరాధన పీఠం గురుస్వామి, అయ్యప్ప పంచాయతన దేవాలయం ధర్మకర్త దుర్గా ప్రసాద్‌పట్నాయక్(60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు.

ఆయన నాలుగు దశాబ్దాలుగా అయ్యప్ప స్వామి మాలా ధారణ చేసి భక్తులకు విశేష సేవలు అందించారు. రెండు పర్యాయాలు అష్టాదశ మాలా దీక్ష చేపట్టారు. ఒడిసా గిరిసోల, ఇచ్ఛాపురం లలో ఎక్కువ మంది భక్తులు ఆయన వద్ద దీక్ష చేపట్టారు.

ప్రస్తుతం ఆయన, కుమారుడు మణికంఠ కూడా దీక్షలో ఉన్నారు. దీక్షలోనే గురుస్వామి ఆకస్మిక మరణంపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# యువత ఉపాధికే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు

**-కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు**

**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికే నైపుణ్యాభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని నాగావళి హోటల్‌లో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఆర్‌ల సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. నిరుద్యోగులు ఉద్యోగ అన్వేషణలోనే సమయం వృధా చేయకుండా ప్రతీ ఒక్క కుటుంబం నుంచి ఒక వ్యాపా టరవేత్త తయారు కావాలన్నదే సీఎం చంద్రబాబు ఉద్దేశమన్నారు. యువత నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సులువుగా పొందవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కార్యక్ర మంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**-నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశం**

**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** అపరిష్కృత కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని, జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ కేసుల్లో త్వరిత గతిన చార్జిషీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేకూర్యాలని సూచించారు.



ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ఏ తగాదాలు, నేరాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ వారీగా ఉన్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సు సీజ్ చేయాలని, సూచించారు. పేకాట శిబిరాలు, బెల్టు షాపులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంతవరకు సంబంధిత అధికారులు చేపట్టిన కేసుల దర్యాప్తును పరిశీలించి, వారికి దిశా నిర్దేశం చేశారు. ఉదయం, సాయంత్రం రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని ఆదేశించారు.

సమావేశంలో అద నపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, మూర్తి, ఏవో గోపీనాథ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం : కలెక్టర్

**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** క్రీస్తు బోధనలు అనుసరణీయమని, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. స్థానిక కరుణ సమాజంలో రెడ్ క్రాస్ సంస్థ, అప్ హెల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, క్రిస్మస్ కేకును కట్ చేసి పిల్లలకు తినిపించారు.

35 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబా లకు కందిపప్పు, గోధుమ పిండి, ఆయిల్, పంచదార, బియ్యం, చీరలు, టవల్స్, దుప్పట్లు, దోమ తెరలు, దుస్తులు పంపిణీ చేశారు. అప్ హెల్ సంస్థ నుంచి రూ. 1,50లక్షల స్కాల ర్షిప్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని తెలిపారు. శ్మశాన వాటికకు ప్రహరీ కావాలని కాలనీ సభ్యులు కోరగా వెంటనే స్పందించిన ఆయన సత్వర చర్యలు చేపట్టనున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి. జగన్మోహన్ రావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలమాన్ సింగ్, అప్ హెల్డ్ ప్రాజెక్ట్ మేనేజర్



క్రిస్టఫర్, రెడ్‌క్రాస్ జిల్లా ఎంసీ మెంబర్లు కళ్యాణ్‌చక్రవర్తి, చిన్మయిరావ్, జి.రమణ, చైతన్యకుమార్, ఉమా శంకర్, పవన్, సుమతి మోహన్, కరుణ సమాజం కుటుంబాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపుపై 27న నిరసన

**-ఆమదాలవలస వైస్సార్సీపీ సమన్వయకర్త రవికుమార్**

**ఆమదాలవలస, డిసెంబర్ 24( వార్త):** కరెంటు చార్జీల బాదుడుపై వైస్సార్సీపీ పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆమదాలవలస వైస్సార్సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆమదాలవలసలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు చార్జీలు తగ్గిస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పదిహేను వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం చంద్రబాబు మోసపూరిత



పాలనకు నిదర్శనమన్నారు. దీనిపై ఈ నెల 27న ఉదయం 10గంటలకు ఆమదాలవలస రైల్వేస్టేషన్ దరిలో గల వన్‌వే జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభి మానులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు విచ్చేసి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సువ్వారి నేతాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బొర్రమాంబపురానికి తాగునీరందించిన కొరికాన

**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 24(వార్త):** ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది రాజకీయ నాయకులు ఓట్లు కోసమే వచ్చి..వెళ్లేవారే తప్ప తమ గోడును పట్టించుకోలేదని, జనసేన నాయకులు తమ సమస్యకు పరిష్కారం చూపారని కొవిలాం పంచాయతీ బొర్రమాంబపురం మహిళలు తెలిపారు. తాగునీటి సమస్యను ఎన్నో ఏళ్లుగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు వాపోయారు. అయితే ఈ సమస్యను పాతపట్నం జనసేన నాయకురాలు కొరికాన భవాని, సుడా చైర్మన్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే వారు స్పందించి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించారని ఆనందం వ్యక్తం చేశారు. వీరి వెంట మండల జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 24(వార్త):** ఇటీవల కురిసిన అకాల వర్షాలతో బెల్లుపడ, ఈదుపురం గ్రామాల్లో తడిచిన ధాన్యం, పన్నలు, నేలకు ఒరిగిన పంట పొలాలను వ్యవసాయ సంచాలకులు జగన్‌మోహన్, డాక్టర్ అనూష, మండల వ్యవసాయ అధికారి టిభార్గవి, వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. తడిచిన ధాన్యం, ఓవులకు ఉప్పు ద్రావణం స్ప్రే చేయాలని సూచించారు. పంట నష్టంపై అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. వీరి వెంట నీటి సంఘం అధ్యక్షుడు కొచెర్ల ధనుంజయ, నాయకులు ఉన్నారు.

## జ్ఞానభారతిలో క్రిస్మస్ వేడుకలు




**ఇచ్ఛాపురం, డిసెంబర్ 24(వార్త):** జ్ఞానభారతి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను పాఠశాల సెక్రటరీ కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను ఆయన కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేమ, శాంతిని బోధించిన ఏసు బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. శాంతి, సౌభ్రాతృత్వం మానవుల మధ్య పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు క్రిస్మస్ గీతాలకు నృత్యాలను చేసి అలరించారు. శాంతాక్లాజ్ గెటప్స్‌తో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి. ప్రిన్సిపాల్ ఇందుభూషణ్ పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**ఎచ్చెర్ల, డిసెంబర్ 24(వార్త):** అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారుల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం



# నిధులు తెస్తా.. అభివృద్ధి చేయండి

* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* ఉపాధి నిధులు వెనక్కి వెళ్లిపోవడం దారుణం
* 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్
* హిరమండలం రిజర్వాయర్ నీటిపై ఆధారపడతామంటే కుదరదు
* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
* పలాస పట్టణానికి వేసవిలో తాగునీటి సమస్య ఉండకూడదు
* పలాస ఎమ్మెల్యే శిరీష
* తొలి సమీక్ష సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించిన ఎమ్మెల్యేలు
* దిశ సమావేశంలో నీళ్లు నమిలిన అధికారులు

**శ్రీకాకుళం, డిసెంబరు24 (వార్త):** జడ్పీ సర్వసభ్య సమావేశ మందిరంలో దిశ తొలి సమావేశం వాడివేడిగానే సాగింది. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద విడుదల చేసిన నిధుల సద్వినియోగం, పరిశ్రమలపై అవగాహన, నిరుద్యోగులకు వివిధ అంశాలపై శిక్షణ తదితర సమా చారం ఎమ్మెల్యేల వద్దకు చేరకపోవడం వారంత ప్రశ్నించారు. చివరకు జిల్లా కలెక్టర్ వద్ద సమాచారం లేదనే కొందరు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం కనిపించింది. రానున్న రోజుల్లో సంబంధిత అధికారులు ఎమ్మెల్యేలకు పూర్తి సమాచారం అందివ్వ డమే కాకుండా జిల్లా కలెక్టర్ సమక్షంలో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తన గళం వినిపించారు. సమీక్షిం చిన శాఖలపై పలువురు ఎమ్మెల్యేలు ప్రశ్నల వర్షం కురిపించగా, సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం డిస్ట్రిక్ట్ డవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మోనటరింగ్ కమిటి (దిశ) సమావేశం శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండకర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జేసీలు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కేంద్రం నుంచి నేను నిధులు తెస్తానని, జిల్లా అభివృద్ధి బాధ్యత మీదే నని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథ కం పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల న్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లనిర్మాణాల్లో పెద్ద స్కాం జరిగిందని విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ సరైన ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో గత ఏడాది ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఒక్క శ్రీకా కుళం జిల్లాలోనే రూ.230 కోట్ల నిధులు వెనక్కి వెళ్లి పోయాయని, గడిచిన ఐదేళ్ల లెక్క చూస్తే రూ. 1000 కోట్లకు పైగా పనులు చేసుకోలేకపోయామని, ఇది క్షమార్హం కాదన్నారు. జలజీవన్ మిషన్, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు. ఉద్దానానికి తాగునీరు అందిస్తున్న హిరమండలం రిజర్వాయర్ పైనే ఆధారపడితే కుదరదని ఎమ్మెల్యే రవికుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ నిధులతో ఉద్దానంలో గత ప్రభుత్వం చేపట్టిన మంచినీటి పథకంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. పాత పథకానికి చెందిన ట్యాంకులను మళ్లీ వినియోగిస్తూ ఇప్పుడు తాగేందుకు నీరు కూడా రాకుండా చేశారన్నారు. ఉద్దానం పథకంలో గతంలో పని చేసిన వారిని తొలగించి అన్యాయం చేశారని, దీనిపై ఒక్కరోజు ప్రత్యే కంగా సమీక్ష నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎమ్మెల్యే తీసుకువచ్చే అంశాలపై మరోసారి సమీక్షించేం దుకు నిర్ణయించారు. జిల్లాలో ప్రస్తుతం సాగుతున్న పనులను వివరిం చారు. ఈ సమావేశంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, గొండు శంకర్ లు వారి వారి నియోజక వర్గాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సిపిఓ ప్రసన్నలక్ష్మి, 33 ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యారు.



# రెప్పపాటులో.. ఘోరం

* పెద్దకొజ్జిరియా జంక్షన్ వద్ద ఘోర ప్రమాదం
* విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
* ముగ్గురు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 24 (వార్త):** రెప్పపాటులో జరిగిన ఘోరంలో మూడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మొక్కుతీర్చుకునేందుకు వెళుతూ మృత్యుఒడిలోకి చేరిన ఘటన కంచిలి మండలం పెద్దకొజ్జిరియా జంక్షన్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జాతీయ రహదారిలో విశాఖ నుంచి ఒడిశా వైపు వెళుతున్న కారు పెద్దకొజ్జిరియా జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కదిరిశెట్టి సోమేశ్వరరావు(48), ఎం.లావణ్య(43), స్నేహగుప్తా(18) దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా విశాఖపట్నంలోని సీతమ్మధార ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. స్నేహగుప్తా ఐఐటీలో సీటు సాధించింది. దీంతో ఒడిశాలోని జాజ్‌పూర్‌లో అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు మంగళవారం ఉదయం విశాఖ నుంచి బయలు దేరారు. కంచిలి మండలం కొజ్జిరియాకు రాగానే డ్రైవర్ కాస్త నిద్ర మత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒడిశాలోని జాజ్ పూర్‌లోని తరిణి మాత దేవాలయానికి మంగళవారం ఉదయం విశాఖ నుంచి ముత్తా వెంకటరంగ రాజేష్ కుటుంబీకులు వాహనంలో బయలు దేరారు. కుమార్తె నేహ ఐఐటీ సాధించిందని భార్య లావణ్య, కుమార్తె నేహ, తల్లి సుబ్బలక్ష్మీతో పాటు భద్రాచలానికి చెందిన తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు, మరదలు రాధికతో కలిసి బయలు దేరారు. రాజేష్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఆయన నిద్రమత్తుకు జారుకోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని సమాచారం. ఈ ప్రమాదంలో ముత్తా లావణ్య ( 43) అక్కడికక్కడే కారులో మృతి చెందగా గాయాలు పాలైన ముత్తా నేహ గుప్తా (18), సోమేశ్వరరావు ( 48), రాదికలను సోంపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నేహ, సోమేశ్వరరావు తనువు చాలించారు. వెనుక సీటులో ఉన్న తల్లి సుబ్బలక్ష్మీకి స్వల్ప గాయాలయ్యాయి. రాధిక పరిస్థితి విషయంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. భార్య లావణ్య, కుమార్తె నేహ తనకళ్లెదుటే కానరాని లోకాలకు వెళ్లిపోయారంటు రాజేష్ గుప్తా కన్నీరుమున్నీరైన ఘటన అక్కడి వారందరిని కలిచివేసింది. కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కంచిలిలో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా పోలీసు అధికారులను సంప్రదించారు. క్షతగాత్రు లను మెరుగైన వైద్య సేవలందివ్వడానికి చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కంచిలి ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేయగా కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సోంపేట సీఐ మంగరాజు ఆస్పత్రికి చేరుకుని వివరాలను సేకరించారు.

# అవమానం జరిగినచోటే బతిమాలిస్తాం

* పోలీసులా.. టీడీపీ కార్యకర్తలా
* రానున్నది వైసీపీ ప్రభుత్వమే
* మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు




**పలాస, డిసెంబరు 24 (వార్త):** రాష్ట్రంలోనూ, పలాస నియోజకవర్గంలోనూ వైసీపీ కార్యకర్తలపై వరుసగా జరుగుతున్న దాడులను ఖండిస్తున్నానని, పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలోనే వైసీపీ కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి కేసులు బనాయిస్తున్నారన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పలాసలో ఐదుగురు టీడీపీ ముఠా అరాచక శక్తులుగా మారారన్నారు. 2029లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అవమానాలు చేసిన వారి చేతనే బతిమిలాడించుకుంటామన్నారు. అప్పటి వరకూ కార్యకర్తలు, నాయకులు ఓర్పుతో ఉండాలని కోరారు. సమావేశంలో మందస ఎంపీపీ డి.దానయ్య, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పలాస మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, దువ్వాడ మధుకేశ్వరరావు, బమ్మిడి సంతోష్ కుమార్, శిస్టుగోపి, బల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీయత్నం కేసులో నలుగురు అరెస్టు

* వీరిలో ముగ్గురు తెలంగాణ వాసులు
* రూ.10వేల నగదు, 3 కత్తులు, ఒక మోటార్ సైకిల్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం
* వివరాలు వెల్లడించిన శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద



**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 24 (వార్త):** ఓ ఇంట్లో చొరబడి కత్తులతో బెదిరించిన కేసులో నలుగురు కటకటాల్లోకి వెళ్లారు. నగరంలో కోరాడ గోవిందరావు ఇంట్లో చొరబడి మారణాయుధాలతో బెదిరించిన సంచలన కేసును స్వల్పవ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. ఈ మేరకు శ్రీకాకుళం డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో వివరాలను డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. వ్యాపార వేత్త కోరాడ గోవింద్ ఇంట్లోకి చొరబడి బీభత్సం సృష్టించి పరారైన కేసులో నలుగురిని అరెస్టు చేశామన్నారు. శ్రీకాకుళంలోని గూనపాలెం చెరువుగట్టు ప్రాంతానికి చెందిన పెద్దిన లక్ష్మణరావు అనే వ్యక్తి ఒక్కరు ఉండగా, తెలంగాణా రాష్ట్రంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన చిగురుపాటి ఆంజనేయులు, నాగర్ కర్నూల్‌కి చెందిన కూరాకుల భానుప్రసాద్, కొత్తగూడెంకి చెందిన సయ్యద్ ఇర్షద్ అలమ్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామన్నారు. వారి వద్ద నుంచి రూ 10వేల నగదు, 3 కత్తులు, ఒక కటింగ్ ప్లేయర్ , ఒక మోటార్ సైకిల్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఎల్ బిఎస్ కాలనీ,గూనపాలెం చెరువుగట్టు ప్రాంతంలో ఉండే కిరాణా వ్యాపారి పెద్దిన లక్ష్మణరావు అడ్డదారిలో సంపాదించాలన్న ఉద్దేశంతో దోపిడికి ప్లాన్ చేసినట్లుగా తెలిపారు. తెలంగాణా రాష్ట్రం నుంచి హోల్ సేల్ షాపులకి ఆయిల్ ప్యాకెట్ లోడుతో తీసుకుని వచ్చే లారీ డ్రైవర్ అయిన సజ్జు అలియాస్ కార్తీక పరిచయం కాగా తనకి కొంతమంది కుర్రాళ్ళు అవసరం ఉందని ఎవరైనా ఉంటే రప్పించమని, పనిఇస్తానని చెప్పాడు. సజ్జుకి పరిచయం ఉన్న భద్రాచలంకి చెందిన యాకూబ్ తో పెద్దిన లక్ష్మణరావును మాట్లాడించగా ఆతడి మేనల్లుడైన సయ్యద్ ఇర్షద్‌ని పరిచయం చేశాడన్నారు. వారం రోజుల క్రితం పెద్దిన లక్ష్మణరావు శ్రీకాకుళంలో పని ఉందని సయ్యద్ ఇర్షద్ తో మాట్లాడి తనతో పాటు ఇద్దరు కుర్రాళ్ళను తీసుకురమ్మనమని చెప్పాడన్నారు. సయ్యద్ ఇర్షద్ తో పాటుగా చిగురుపాటి ఆంజనేయులు, కూరాకుల భాను ప్రసాద్ లు శ్రీకాకుళం వచ్చి లక్ష్మణరావును కలిశారన్నారు. ఉమెన్స్ కాలేజీ దగ్గర్లో ఉన్న ఇండియన్ బ్యాంకు దొంగతనం చేయమని చెప్పగా అక్కడ జనాభా ఎక్కువగా ఉండడంతో వారు భయపడినట్లుగా తెలిపారు. ఆ తర్వాత లక్ష్మణరావు ఇంటికి సమీపంలో ఉన్న వేరొకరి ఇంటిని చూపించగా వారు అక్కడకు వెళ్ళేసరికి వారు కేకలు వేయడంతో భయపడి పారిపోయారన్నారు. ఆ తర్వాత వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంటిని చూపించి వారి ఇంటికి వెళ్ళి బెదిరిస్తే అధిక మొత్తంలో డబ్బులు, బంగారం సొంతం చేసుకోవచ్చిన చెప్పి ఆ ముగ్గురిని పంపించాడన్నారు. కోరాడ గోవిందరావు ఇంట్లోకి ముగ్గురు ప్రవేశించి కత్తులను చూపించి ఇంట్లో ఉన్న మహిళలను బెదిరించి టేబుల్ పై ఉన్న రూ 12 వేల నగదును తీసుకోగా ఇంట్లో ఉన్న యువకుడు వీరిపై ఎదురుతిరిగాడన్నారు. ఆతడు ధైర్యంగా ఎదిరించి కేకలు వేయడంతో వీరు పరారయ్యారన్నారు. డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో సిఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో ఏఎస్ఐ రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ బి.రవికుమార్ ఇతర సిబ్బంది విచారణను చేపట్టి ముద్దాయిలను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరచిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ వివేకానంద అభినందించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం







# ఆర్‌సీఎం చర్చిలో..

శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 24 (వార్త): శ్రీకాకుళం నగరంలోని ఆర్‌సీఎం చర్చి (సహాయమాత ప్రార్ధనా మందిరం)లో క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. బిషప్‌లు రెవరేండం రాయరాల విజయ్ కుమార్, రెవరేండం పాల్ భూషణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ క్రైస్తవులు సందడి చేశారు. పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని క్యాండిల్స్ వెలిగించారు. ఆర్‌సీఎం చర్చి విద్యుద్దీపాలతో మెరిసింది.


















జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం








# ఉత్సాహంగా.. క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 24 (వార్త): జిల్లావ్యాప్తంగా ఉన్న చర్చీల్లో క్రిస్మస్ సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శ్రీకాకుళం నగరంలోని డగ్లస్ స్కూల్ క్యాంపస్ ఆవరణలో ఉన్న కీస్టోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దఎత్తున క్రైస్తవులు చర్చికి వచ్చి ఆనందంగా గడిపారు. పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చర్చిలో పాస్టర్ జోయిల్ శాం, హనా జోయిస్‌లు ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రార్థనలు చేశారు. క్యాండిల్స్ వెలిగించి క్రీస్తుకు ఆహ్వానం పలికారు. హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ క్రైస్తవులు సందడి చేశారు.





## నారాయణలో క్రిస్మస్ సంబరాలు

శ్రీకాకుళం నగరంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీస్తు సందేశం మానవాళికి ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ శిరీష, శ్రీదేవి, ఆర్ఐ రాంబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546